క్లుప్తంగా

నేడు రైతుల ధర్నా

బోథ్: మండల కేంద్రంలో సోమవారం అఖిలక్ష రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించనున్నట్లు సంఘం సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎకరానికి జొన్న పంటను ప్రభుత్వం కేవలం 8.85 క్వింటాళ్ల మాత్రమే కొనడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎకరాకు కనీసం 13 క్వింటాళ్లు కొనాలని డిమాండ్ చేశారు. ధర్నాకు మండల రైతులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

అన్నదానం మహాదానం

కైలాస్‌నగర్: అన్నదానమే మహాదానమని షమా ఉర్దూ మీడియం స్కూల్ కరస్పాండెంట్ సలీమొద్దీన్ అన్నారు. సంగెం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. మారుమూల ప్రాంతాల నుంచి వివిధ పనుల నిమిత్తం జిల్లా కేంద్రానికి వచ్చే పేద ప్రజల ఆకలి తీర్చేలా అన్నదానం చేపట్టడం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో న్యాయవాది సుధీర్ కుమార్ సంగెం, మహేందర్ రెడ్డి, సుభాష్, రాజయ్య, అంబయ్య, విజయ్ పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు కార్డన్‌సెర్చ్



పట్టుకున్న వాహనాలతో అధికారులు

ఖానాపూర్: శాంతిభద్రతల పరిరక్షణకు కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నట్లు ఖానాపూర్ సీఐ సైదారావు అన్నారు. ఆదివారం మండలంలోని రాజురా గ్రామంలో పోలీసులు కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ఈసందర్భంగా సరైన పత్రాల్లేని 81 బైక్‌లు, ఆరు ఆటోలు, రెండు కార్లు, ఓ ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. అనంతరం రోడ్డు సేఫ్టీ, సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్సైలు శంకర్, లింబాద్రి, సిబ్బంది తదితరులు ఉన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ



ఎక్బాల్‌పూర్‌లో తనిఖీ చేస్తున్న ఫ్లయింగ్ స్క్వాడ్ టీం

ఖానాపూర్: మండల సరిహద్దులోని ఎక్బాల్‌పూర్‌తోపాటు జిల్లా సరిహద్దులోని బాదనకుర్తి చెక్‌పోస్ట్ వద్ద ప్రధాన రహదారిపై అధికారులు ముమ్మరంగా తనిఖీలు చేపడుతున్నారు. ఆదివారం ఫ్లయింగ్ స్క్వాడ్ టీం ఇన్‌చార్జి రవీందర్ ఆధ్వర్యంలో ఎక్బాల్‌పూర్‌లో.. ఎస్ఎస్‌టీ టీం ఆధ్వర్యంలో బాదనకుర్తి చెక్‌పోస్టు వద్ద తనిఖీలు చేపడుతున్నారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలని అధికారులు తెలియజేస్తున్నారు. కార్యక్రమంలో సిబ్బంది మదన్‌మోహన్, ఊషన్న, రాజేశ్వర్ తదితరులు ఉన్నారు.

వీడ్కోలు హంగామా



నృత్యం చేస్తున్న విద్యార్థులు

ఖానాపూర్: పట్టణంలోని జీవీఆర్ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థుల వీడ్కోలు వేడుకలు నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ గాండ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో ఉంటూ జ్ఞాన సముపార్జన చేసుకోవాలని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నగదు పట్టివేత



పట్టుకున్న నగదుతో పోలీసులు

బోథ్: మండలంలోని ఘన్‌పూర్ చెక్‌పోస్ట్ వద్ద పోలీసులు నగదు పట్టుకున్నారు. ఎస్సై రాము తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం రాత్రి సమయంలో వాహనాలను తనిఖీ చేస్తుండగా.. మహారాష్ట్ర నుంచి నిర్మల్ జిల్లా కేంద్రానికి వెళుతున్న ఓ వ్యక్తి నుంచి రూ. 77,600 నగదును పట్టుకున్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో రూ. 50,000లకు మించి నగదును తీసుకెళ్లరాదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రాము. ఏఎస్సై గంగారెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పేరుకే రౌండ్ ది క్లాక్

- మంజూరు కానీ రెండో డాక్టర్ పోస్టు
- బేల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలు అంతంతే
- పట్టించుకోని ఉన్నతాధికారులు



బేల ఐకేపీ కార్యాలయంలో కొనసాగుతున్న ప్రాథమిక ఆరోగ్యకేంద్రం

బేల ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలో జనాభా ఇలా..

ఆరోగ్య ఉపకేంద్రం	జనాభా
బేల	8,248
దహెగాం	5,457
సాంగిడి	4,730
సిర్సన్న	6,320

సైద్‌పూర్ పరిధిలో ఇలా..

ఆరోగ్య ఉపకేంద్రం	జనాభా
చప్రాల	5,284
కొబ్బాయి	4,787
సైద్‌పూర్	6,111

సిబ్బంది పట్టించుకోవడం లేదు



బేల గవర్నమెంట్ దవాఖానాలో డాక్టర్ లేనప్పుడు రోగులను వైద్య సిబ్బంది పట్టించుకోవడం లేదు. నామమాత్రంగా గోళీలు, మందులు ఇచ్చి పంపిస్తున్నారు. షుగర్, ఇతరత్ర రక్త పరీక్షలు చేయించుకుంటే, మరుసటి రోజు రిపోర్టు కోసం వెళ్తే రిపోర్టు రాలేదని నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారు. రాత్రివేళ వైద్య సేవలు అందడం లేదు. –షేక్ ఖాయిర్, బేల

డాక్టర్ పోస్ట్ మంజూరు చేయాలి



జిల్లాలోని అంకోలి, తలమడుగు, నేరడిగొండ, భీంపూర్ రౌండ్ ది క్లాక్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు రెండేసి డాక్టర్ పోస్టులు ఉన్నాయి. కానీ బేల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఒకే డాక్టర్ ఉన్నాడు. పలుమార్లు ఉన్నతాధికారులకు విన్నవించాం అయినా.. ఎవరూ పట్టించుకోవడం లేదు. కలెక్టర్ స్పందించి రెండో డాక్టర్ పోస్టు మంజూరు చేయాలి. – జి. సంజయ్, మండల యూత్ నాయకులు

బేల: బేల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రెండో డాక్టర్ పోస్ట్ పోస్టు ఖాళీగా ఉండడంతో ప్రజలకు వైద్యసేవలు సకాలంలో అందడం లేదు. ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పేరుకే రౌండ్ ది క్లాక్‌గా ఉంది. ఉన్న డాక్టర్ అందుబాటులో లేకపోతే ఎలా అనిరోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలోని నేరడిగొండ, తలమడుగు, అంకోలి, భీంపూర్, ఇంద్రవెల్లి, నార్నూర్ రౌండ్ ది క్లాక్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు రెండేసి డాక్టర్ పోస్టులు ఉన్నాయి. కానీ బేల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఏళ్లుగా ఒకే డాక్టర్‌తో సేవలు అందిస్తున్నారు. ఈవిషయమై మండల వాసులు అధికారులకు విన్నవించినా.. ఎలాంటి ఫలితం పోతున్నారు. మండల ప్రజాప్రతినిధులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ఈ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలో బేలతో పాటు దహెగాం, సాంగిడి, సిర్సన్న ఆరోగ్య ఉప కేంద్రాలు ఉన్నాయి. గతంలో ఔట్ పేషెంట్ వార్డులో రోగుల సంఖ్య ప్రతీ రోజు 80కు పైబడి ఉండేది. ప్రతీ బుధవారం వారసంత కావడంతో 100 నుంచి 200 వరకు ఉండేది. కానీ క్రమంగా రోగుల సంఖ్య తగ్గింది.

డాక్టర్ లేకపోతే..

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ సమావేశాలు, క్షేత్రస్థాయిలో వైద్య శిబిరాలు, వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక అవగాహన కార్యక్రమాలకు వెళ్లిన సమయంలో రోగులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. దీంతో రోగులను పట్టించుకునే నాథుడే ఉండడు. వైద్య సిబ్బంది నుంచి వైద్య సేవలు నామమాత్రంగా అందుతున్నాయని రోగులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో రోగులు తప్పనిసరి పరిస్థితిలో ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించి ఆర్థికంగా నష్టపోతున్నారు. ప్రస్తుతం వైద్య సిబ్బంది సరిపడా లేకపోవడంతో సకాలంలో వైద్యం అందడం లేదు. ప్రసూతిలకైతే జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు రెఫర్ చేస్తున్నారు.

'కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం'



పార్టీలోకి ఆహ్వానిస్తున్న కంది శ్రీనివాసరెడ్డి

కైలాస్‌నగర్: కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రజాసేవా భవన్‌లో ఆదిలాబాద్ పట్టణంలోని 32వ వార్డు బొక్కల్‌గూడ కాలనీకి చెందిన మైనార్టీ నాయకులు షాకీర్, ఖయ్యూమ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్, ఎంఐఎం నాయకులు బేల, జైనథ్ మండలాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున కాంగ్రెస్‌లో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్లమెంట్ పరిధిలోని ఆసిఫాబాద్ జిల్లాకు సీఎం రేవంత్ రెడ్డి త్వరలో రానున్నారని తెలిపారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, వెంకట్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆత్రం సుగుణను గెలిపించాలి

పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. ఆదివారం ఆదిలాబాద్ పట్టణంలోని 44, 45వ వార్డులు బొక్కల్‌గూడ, ఖుర్షీదాపూర్‌లలో ఇంటింటికీ తిరుగుతూ ఎన్నికల ప్రచారం చేశారు. ప్రజలకు కరపత్రాలు పంచుతూ.. ఓటు అభ్యర్థించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు గుడిపెల్లి నగేశ్, లోక ప్రవీణ్ రెడ్డి, ఆశమ్మ, వెంకట్ రెడ్డి, సామ రూపేష్ రెడ్డి, సయ్యద్ షాహిద్ అలీ, అంజద్‌ఖాన్ పాల్గొన్నారు.

అందుబాటులో సేంద్రియ ఎరువు



ప్యాకింగ్ చేసిన సేంద్రియ ఎరువులు

నేరడిగొండ: రసాయన ఎరువుల అధిక వాడకంతో భూసారం దెబ్బతింటోందని మండలంలోని వడూర్ గ్రామపంచాయతీ కార్యదర్శి నర్సారెడ్డి తెలిపారు. భూసారాన్ని రక్షించడంతో పాటు రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించేలా గత రెండు సంవత్సరాలుగా గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో సేంద్రియ ఎరువు తయారు చేస్తున్నట్లు పేర్కొన్నారు. గ్రామంలోని చెత్తాచెదారాన్ని సెగ్రిగేషన్ షెడ్డుకు తరలించి అక్కడే సేంద్రియ ఎరువులను తయారు చేయడం జరుగుతుందన్నారు. కిలో రూ.20 చొప్పున విక్రయిస్తున్నట్లు తెలిపారు. అవసరమున్న రైతులు ముందస్తుగా సమాచారం అందిస్తే వాటిని అందించడం జరుగుతుందన్నారు.

రోడ్లపై పశువుల సంచారం



రోడ్డు మీద సేదతీరుతున్న పశువులు

- ప్రమాదాల బారిన పడుతున్న ప్రజలు
- పట్టించుకోని పంచాయతీ సిబ్బంది

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంలో పశువులు రోడ్లపై, సంతల్లో సంచరిస్తుండటంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. పశువుల యజమానులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఉట్నూర్, ఇంద్రవెల్లి, ఇచ్చోడ, గుడిహత్నూర్ ప్రధాన రోడ్డు గుండా పశువులు సంచరిస్తుండడంతో ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్నారు. కనీసం పట్టించుకునే నాథుడే కరువయ్యాడని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంద్రవెల్లి– ఉట్నూర్ మండల కేంద్రం వరకు రోడ్డు గుంతలమయంగా ఉండడం, అలాగే పశువుల సంచారం ఉండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయాందోళన చెందుతున్నారు. రోడ్లపైకి పశువులను వదలకుండా యజమానులను కట్టడి చేయాల్సిన పంచాయతీ సిబ్బంది పత్తాలేకుండా పోయారు.

నిరుపయోగంగా బంజరు దొడ్లు..

ప్రతీ గ్రామంలో పశువుల యజమానులు రోడ్లపై వదిలేసిన పశువులను బంజరు దొడ్డిలో ఉంచి, వారికి తగిన జరిమానా విధించి అప్పచెప్పడం జరుగుతుంది. కానీ బంజరు దొడ్లు నిరుపయోగంగా మారాయి. గతంలో పశువులను బంజరు దొడ్డిలో వేసి అప్పగించారు. మళ్లీ పశువులు యథావిధిగా రోడ్లపై సంచరిస్తున్నాయి. అటు పంచాయతీ సిబ్బంది, అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు.

వారసంతలో అదే తీరు..

వారసంతలో కిక్కిరిసిన జనాల మధ్య పశువులు సంచరిస్తూ ప్రజలను ఇబ్బందికి గురిచేస్తున్నాయి. కొమ్ములతో పొడిచి ప్రజలను గాయపరిచిన ఘటనలు కూడా ఉన్నాయి. ఇంత జరిగిన పంచాయతీ అధికారులు వారసంతలో ట్యాక్స్‌లు తీసుకుంటున్న వ్యాపారులకు, ప్రజలకు రక్షణ కల్పించడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్లపై సంచరించే పశువులను గోశాలకు అప్పగించాలని ప్రజలు కోరుతున్నారు.

కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారం



సన్మానిస్తున్న సమాజ్ ప్రతినిధులు

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణ బ్రాహ్మణ్ సమాజ్ కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని ఆదివారం తిర్పెల్లి రామాలయంలో నిర్వహించారు. గత నెల 14న జరిగిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా అన్నోజుల సంతోష్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా విశ్వాస్ నిర్మల్కర్, కోశాధికారిగా అభిలాష్ టింబేకర్‌లు ఎన్నికయ్యారు. కార్యక్రమానికి ఎన్‌టీటీ డాటా బిజినెస్ సొల్యూషనస్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్, ఇండియా రీజియన్ మేనేజింగ్ డైరెక్టర్ సంజీవ్ దేశ్‌పాండే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బ్రాహ్మణ్ సమాజ్ ప్రతినిధులు పూలమాల, శాలువాలతో సత్కరించారు.

సనాతన ధర్మాన్ని కాపాడాలి



మాట్లాడుతున్న గోడం నగేశ్

ఇచ్చోడ: సనాతన ధర్మాన్ని కాపాడాలని, వైష్ణవ సదన్ నారాయన్ మహరాజ్ చేస్తున్న కృషి చాలా గొప్పదని ఆదిలాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేశ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో విఠలేశ్వర ఆలయంలో నిర్వహిస్తున్న సత్‌సంగ్ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. గత రెండు సంవత్సరాలుగా ప్రతీ ఆదివారం రోజు విఠలేశ్వర ఆలయంలో సత్‌సంగ్ కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పార్లమెంట్ కోఆర్డినేటర్ ముస్తాపురే అశోక్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానందం, తదితరులు పాల్గొన్నారు.

'బీజేపీని ఓడించడమే లక్ష్యం'



మాట్లాడుతున్న శ్రీనివాస్

ఉట్నూర్‌రూరల్: దేశంలో బీజేపీని ఓడించడమే సీపీఐ (ఎంఎల్)న్యూడెమోక్రసి లక్ష్యమని జిల్లా కార్యవర్గ సభ్యుడు శ్రీనివాస్ అన్నారు. ఆదివారం ప్రెస్‌భవన్‌లో మాట్లాడారు. పది ఏళ్లలో బీజేపీ రైతులకు, ప్రజలకు చేసిందేమి లేదన్నారు. కార్పొరేట్ సంస్థలకే లాభం చేకూర్చిందన్నారు. ప్రజల జీవన ప్రమాణాలు పెంచడంలో బీజేపీ వెనుకబడిందని విమర్శించారు. గిరిజన ప్రాంతాల్లో 1/70, పీసా చట్టాలను తుంగలో తొక్కారని ఆరోపించారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి రాజు, జిల్లా కార్యదర్శి సభ్యుడు నారాయణ, కేశవ్, సర్దార్, పీడీఎస్‌యూ జిల్లా నాయకులు గణేశ్, హోమస్, తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా బీజేపీ ప్రచారం



ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

తాంసి: మండల కేంద్రంలో ఆదివారం బీజేపీ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సామ సంతోష్ రెడ్డి నాయకులతో కలిసి ఇంటింటా బీజేపీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యమన్నారు. మరోసారి నరేంద్రమోదీని గెలిపించి, దేశానికి అండగా ఉండాలన్నారు. ప్రతీ గ్రామానికి కేంద్ర ప్రభుత్వం అనేక అభివృద్ధి నిధులు కేటాయించిదన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ప్రవీణ్‌రెడ్డి, విలాస్, కిషన్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

బోథ్: మండల కేంద్రంలో బీజేపీ నాయకులు ఆదివారం ఇంటింటా తిరుగుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రధానిగా మోదీ ఉంటేనే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. ఆదిలాబాద్ ఎంపీగా బీజేపీ అభ్యర్థి గోడం నగేశ్‌ను గెలిపించాలని కోరారు. కమలం పువ్వు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ఇంటింటికీ తిరుగుతూ వివరించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు జక్కుల వెంకటేశ్, చిటికెషి వెంకటేశ్, సాయి రోహిత్, నితేష్ గౌడ్, సొలంకి సాయి, భరత్ పాల్గొన్నారు.

'బీజేపీ, బీఆర్ఎస్‌కు బుద్ధి చెప్పాలి'



కాంగ్రెస్ పథకాల గురించి వివరిస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌రూరల్: గత పదేళ్ల పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిస్థాయిలో విఫలం చెందిన బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు ద్వారా తగిన బుద్ధి చెప్పాలని తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి అన్నారు. ఆదివారం మావల మండల కేంద్రంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించారు. ఆగస్టు 15లోగా రూ.2లక్షల రుణమాఫీ చేస్తామన్నారు. ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆత్రం సుగుణను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గోవర్ధన్ రెడ్డి, మావల మండల అధ్యక్షుడు ధర్మపురి చంద్రశేఖర్, కోఆప్షన్ మెంబర్ రహీమ్ ఖాన్, నాగరాజు, రెండ్ల రాజన్న, ప్రభాకర్, సంటెన్న, మద్దెల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం



ఎన్నికల ప్రచారం చేస్తున్న అశ్విన్ రెడ్డి



ఓటు అభ్యర్థిస్తున్న సామ రూపేష్‌రెడ్డి

బజార్‌హత్నూర్: ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని కాంగ్రెస్ నాయకులు ఏలేటి అశ్విన్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని పిప్రి గ్రామంలో ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో పేదరికం నిర్మూలన కావాలంటే కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావాలన్నారు. కులం, మతం పేరుతో ఓట్లు అడుగుతున్న బీజేపీని ఇంటికి పంపాలని కోరారు. మండల కేంద్రంలో జెడ్పీటీసీ మల్లేపూల నర్సయ్య ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం చేశారు. కార్యక్రమంలో కోవ దౌలత్‌రావ్ మోకాసి, జల్కే పాండురంగ్, సామన్‌పల్లి శేఖర్, మునేశ్వర్ నారాయణ, భాస్కర్‌రెడ్డి, రఘున్‌రెడ్డి, పాండు, కిషన్, విఠల్, ప్రభాకర్ పాల్గొన్నారు.

ప్రజల మధ్య చిచ్చుపెడుతున్న బీజేపీ

బేల: బీజేపీ మతం పేరుతో ప్రజల మధ్య చిచ్చు పెడుతుందని యూత్ కాంగ్రెస్ నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి సామ రూపేష్‌రెడ్డి అన్నారు. ఆదివారం కాంగ్రెస్ నియోజకవర్గం ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి నేతృత్వంలో మండలంలోని జూనోని గ్రామంలో ఎన్నికల ప్రచారం చేశారు. ఇంటింటికీ తిరుగుతూ రానున్న పార్లమెంటు ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణకు ఓటు వేయాలని కోరారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు పోతుందన్నారు. గత పదేళ్లలో కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రజలకు ఏమి చేసిందో చెప్పాలన్నారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద పేదోడికి ఇళ్లు ఎందుకు నిర్మించి ఇవ్వలేదన్నారు. కార్యక్రమంలో నాయకులు ఋషిదేవ్, కన్యరాజు, తులసిరాం, బాపురావు, తదితరులు పాల్గొన్నారు.

కప్పర్లలో కాంగ్రెస్ నాయకుల ప్రచారం

తాంసి: మండలంలోని కప్పర్ల గ్రామంలో కాంగ్రెస్ నాయకుల ఆదివారం ఎన్నికల ప్రచారం చేశారు. కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణను గెలిపించాలని కోరారు. అనంతరం గ్రామంలో చెరువు వద్ద ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీల దగ్గరకు వెళ్లి ఓటు వేయాలని అభ్యర్థించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే ఐదు గ్యారంటీలను అమలు చేయడం జరిగిందన్నారు. త్వరలోనే రుణమాఫీ సైతం చేస్తామన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రాష్ట్రం, దేశం అభివృద్ధిలో దూసుకుపోతుందన్నారు. కార్యక్రమంలో మండల నాయకులు సంతోష్, భజరంగ్, గంద్రత్ అరుణ్, ప్రభాకర్, రామకృష్ణ పాల్గొన్నారు.

'ఆత్రం సక్కు గెలుపు ఖాయం'



ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

బోథ్: ఆదిలాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి ఆత్రం సక్కు గెలుపు ఖాయమని బోథ్ ఎంపీపీ తుల శ్రీనివాస్ అన్నారు. ఆదివారం మండలంలోని పార్డి, నాగుగూడ, జైతుగూడ, మహాదుగూడ, కేశవ్ గూడ, లెండిగూడ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో నాయకులు నారాయణ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, అల్లకొండ ప్రశాంత్, బాబు సింగ్, రమేశ్, రుక్మన్ సింగ్, నరేందర్, రాథోడ్ రాయల్, మునేశ్వర్ సోమన్న పాల్గొన్నారు.